క్లుప్తంగా

మొక్కల పంపిణీ



ఎస్.కోట పట్టణ వాసులకు మొక్కలు పంపిణీ చేస్తున్న జియో రామకృష్ణ

శృంగవరపుకోట: పట్టణానికి చెందిన గ్రీన్ ఎర్త్ ఆర్గనైజేషన్ (జియో) స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు బి.రామకృష్ణ తన పుట్టినరోజు సందర్భంగా పట్టణంలో పలువురికి ఉచితంగా మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా 'పుట్టినరోజున పది మొక్కలు నాటుదాం' పేరుతో మొక్కల పంపిణీ కార్యక్రమం ఎప్పుడో ప్రారంభించామని చెప్పారు. సామాజిక అడవుల పెంపకంలో అంతా భాగస్వాములు కావాలని ఆయన కోరారు.కార్యక్రమంలో సిమ్ డైరెక్టర్ వై.విజయలక్ష్మి, పంచాయతీ మాజీ వార్డు మెంబర్ బొబ్బిలి అప్పారావు, జియో సంస్థ ప్రతినిధులు హృషికేష్,లాస్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

అభినందన



సుప్రీం కోర్టు విశ్రాంత సీజే ఎన్.వి.రమణ చేతుల మీదుగా ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందుకుంటున్న విద్యార్థిని హాసిని

వేపాడ: మహాకవి గురజాడ వెంకట అప్పారావు వర్ధంతిని పురస్కరించుకుని జిల్లా కేంద్రం విజయనగరంలో శనివారం నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో సోంపురం ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎం.హాసిని ప్రతిభ కనబరిచింది. 650 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీల్లో హాసిని తృతీయ స్థానంలో నిలిచి, సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి, జస్టిస్ ఎన్.వి.రమణ చేతుల మీదుగా ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందుకుందని హెచ్ఎం బి.పి.ఏ.రాజు చెప్పారు. విద్యార్థినినితో పాటు శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయుడు రవిశంకర్‌కి హెచ్ఎం, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఆదివారం అభినందనలు తెలిపారు.

అన్నదానం

వేపాడ: వల్లంపూడి గ్రామంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి మఠం వద్ద విశ్వబ్రాహ్మణుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం అన్నదానం నిర్వహించారు. ఉదయం వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం వందలాది మంది భక్తులకు అన్నదానం చేశారు.


గ్రంథాలయానికి వితరణ

గజపతినగరం: స్థానిక శాఖా గ్రంథాలయానికి మండల కేంద్రంలోని దిగువ వీధికి చెందిన తాళ్లపూడి సౌమిత్రీ త్రివేది సిమెంట్ బెంచీలను వితరణ చేశారు. రూ.7 వేల విలువైన రెండు బెంచీలను లైబ్రేరియన్ వై.స్వప్నకు ఆదివారం అందజేశారు. దాతను లైబ్రేరియన్, పాఠకులు అభినందించారు.

ప్రజలపై భారం మోపడం సరికాదు

బొండపల్లి: సర్దుబాటు పేరుతో ప్రజలపై కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీల భారం మోపడం సరికాదని సీపీఐ జిల్లా నాయకుడు పురం అప్పారావు అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే రానున్న అయిదేళ్లు విద్యుత్ చార్జీలు పెంచబోమని ఎన్నికలకు ముందు చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారని గుర్తు చేశా రు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు కాక ముందే హామీలను తుంగలో తొక్కి చార్జీలు పెంచడం ప్రజలను మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు. విద్యుత్ చార్జీల పెంపు నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.


గోతులు పూడ్చరూ..



దత్తిరాజేరు: పెదమానాపురంలో మజ్జి గౌరమ్మ గుడి సమీపంలో రోడ్డుపై ఏర్పడిన గోతులు

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం సంత నుంచి ఇంగిలాపల్లికి వెళ్లే బీటీ రోడ్డు ఎక్కడికక్కడే గోతులు తేలడంతో ఆ మార్గంలో ప్రయాణించే వారు ఇబ్బందులు పడుతున్నారు. గోతుల్లో వర్షం నీరు చేరడంతో ద్విచక్ర వాహన చోదకులు వాటిని అంచనా వేయలేక ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని వాహనచోదకులు, ప్రయాణికులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా..



గంట్యాడ: మండలంలోని పెదవేమలి గ్రామం నుంచి పినవేమలి వెళ్లే రోడ్డు మధ్యలో ఏర్పడిన గొయ్యి ప్రమాదకరంగా తయారైంది. రాత్రి వేళ ప్రయాణించే ద్విచక్ర వాహనచోదకులు, సైక్లిస్టులు ఈ గొయ్యిని గుర్తించలేక పడిపోయే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి గొయ్యిని పూడ్చాలని వాహనచోదకులు కోరుతున్నారు.

పరిశ్రమ తెరుచుకునేదెప్పుడో..?

- ఆరేళ్లక్రితం మూతపడిన గర్భాంలోని ఆంధ్రా ఫెర్రోఎల్లాయిస్ పరిశ్రమ
- యాజమాన్యం, కార్మికుల మధ్య కొలిక్కిరాని చర్చలు
- పరిశ్రమను తెరిపిస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి
- కూటమి అధికారంలోకి వచ్చి ఆరునెలలు కావస్తున్నా పట్టించుకోని స్థానిక ఎమ్మెల్యే
- పరిశ్రమ ఎప్పుడు తెరుస్తారా అని ఎదురు చూస్తున్న 500 మంది కార్మికులు



మూతపడిన గర్భాంలోని ఆంధ్రా ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమ

మెరకముడిదాం: గర్భాం గ్రామంలోని ఆంధ్రా ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమ ఎప్పుడు తెరుచుకుంటుందా అని వందలాది కార్మిక కుటుంబాలు ఎదురు చూస్తున్నాయి. 2003వ సంవత్సరంలో బాలాజీ ఫెర్రో పరిశ్రమ పేరుతో ఇక్కడ పరిశ్రమను ప్రారంభించారు. పరిశ్రమలో సిలికా మాంగనీస్, హైకార్బన్ మాంగనీస్ మెటల్ ఉత్పత్తి చేసేవారు. అయితే ఉత్పత్తి ప్రారంభమైన కొద్ది రోజులకే పరిశ్రమ మూతపడింది. మూతపడిన ఈ పరిశ్రమను కొత్తవలసలో ఉన్న ఆంధ్రాఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమ యాజమాన్యం కొనుగోలు చేసింది. అప్పటి నుంచి 507 మంది కార్మికు లతో ఈ పరిశ్రమ 2018 అక్టోబర్ వరకు బాగానే నడిచింది. ఆ తర్వాత యాజమాన్యప్రతినిధుల మధ్య తగాదా, విద్యుత్ బిల్లుల భారం, కార్మికులకు బకాయిలు చెల్లింపులు, తదితర సమస్యల వల్ల పరిశ్రమ మూతపడినట్లు సమాచారం. విద్యుత్ బిల్లుల భారం సుమారు రూ.20 కోట్లకుపైగానే ఉందని, బ్యాంకు రుణాలు కూడా కోట్లలోనే ఉన్నట్టు తెలుస్తోంది. సమస్య ఏదైనా పరిశ్రమ మూతపడి ఆరేళ్లు కావస్తున్నా ఇంతవరకూ తిరిగి తెరవకపోవడంతో కార్మికులు ఆందోళన చెందుతున్నారు. ఈ పరిశ్రమపై ప్రత్యక్షంగా 500 కుటుంబాలు, పరోక్షంగా వెయ్యి కుటుంబాల వరకు ఆధారపడి జీవించేవి. పరిశ్రమను ఎప్పుడు తెరుస్తారా అని కార్మికులు ఆరేళ్లుగా ఎదురు చూస్తూనే ఉన్నా రు. కొంతమంది కార్మికులు గత్యంతరం లేక ఇతర పనులు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు.

చర్చలే మిగులుతున్నాయి..

పరిశ్రమ మూతపడిన నాటి నుంచి ఇప్పటి వరకు పలు దఫాలు యాజమాన్యం, కార్మిక సంఘాల నాయకులు మధ్య చర్చలు జరిగినప్పటికీ కొలిక్కి రాలేదు. ఇటీవల విజయనగరం జాయింట్ కలెక్టర్ సేతుమాధవన్, కార్మికశాఖ అధికారుల ఆధ్వర్యంలో పరిశ్రమ యాజమాన్య ప్రతినిధులు, కార్మిక సంఘం నాయకుల మధ్య మరోమారు చర్చలు జరిగాయి. కార్మికులు తమ బకాయి వేతనాలు, గ్రాట్యుటీ చెల్లించాలని డిమాండ్ పెట్టారు. దీనికి యాజమాన్య ప్రతినిధులు ఇప్పుడు ఇవ్వలేమని బదులిచ్చారు.దీంతో అధికారులు ముందు పరిశ్రమను తెరవనివ్వాలని, ఆతర్వాత వాటి గురించి చర్చిద్దామని కార్మిక సంఘం నాయకులను ఒప్పించారు. అయితే పరిశ్రమ యాజమాన్యం దానికి అంగీకరించకుండా బకాయిలు అడగబోమని పత్రాలపై రాసి ఇవ్వాలని డిమాండ్ పెట్టడంతో కార్మికులు దానికి ససేమిరా అనడంతో అక్కడితో చర్చలు నిలిచిపోయాయి

ఎన్నికల హామీ గుర్తుందా..?

తాము అధికారంలోకి వస్తే పరిశ్రమను తెరిపిస్తామని, కార్మికుల జీవితాల్లో వెలుగులు తీసుకువస్తామని సార్వత్రిక ఎన్నికల సమయంలో ఎన్డీ యే ఎమ్మెల్యే అభ్యర్థి కళా వెంకటరావు హామీ ఇచ్చారు. ఎన్నికల్లో ఆయన విజయం సాధించడం, కూటమి అధికారంలోకి రావడం జరిగి సుమారు ఆరునెలలు కావస్తోంది. అయినా ఇంతవరకూ పరిశ్రమను తెరిపించడం కోసం యాజమాన్యంతో ఆయన ఒక్కసారి కూడా చర్చలు జరపలేదు. ఎన్నికల హామీ ఎమ్మెల్యే కళా వెంకటరావుకు గుర్తుందా అని కార్మికులు ప్రశ్నిస్తున్నారు.

కనకమహాలక్ష్మి దేవస్థానంలో పూజలు



అమ్మవారి దేవస్థానంలో భజన చేస్తున్న భక్తులు

చీపురుపల్లి: పట్టణంలోని కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో ప్రధాన అర్చకులు రవిశర్మ నేతృత్వంలో ఆదివారం ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. దేవస్థానం మండపంలో భక్తులు భజనలు చేశారు. అలాగే అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం చేశారు.



భక్తులకు అన్నప్రసాద వితరణ

జాతీయస్థాయి సెపక్ తక్రా పోటీలకు ఎంపిక



విద్యార్థినులను అభినందిస్తున్న ఎంఈఓ విజయకుమారి, ప్రిన్సిపాల్ జ్యోతి

గంట్యాడ: రాష్ట్ర స్థాయి సెపక్ తక్రా పోటీల్లో స్థానిక కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ) నకు చెందిన 9వ తరగతి విద్యార్థినులు కె.అశ్విని, టి.పవిత్ర ఉత్తమ ప్రతిభ కనబరచడంతో జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారని కేజీబీవీ ఎస్ఓ అల్లుజ్యోతి ఆదివారం తెలిపారు. నంద్యాల జిల్లా నంది కొట్కూరులో గత నెల 26, 27 తేదీల్లో నిర్వహించిన సబ్ జూనియర్ సెపక్ తక్రా పోటీల్లో విజయనగరం జిల్లా జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. ఈజట్టులో కేజీబీవీ విద్యార్థినులు ప్రాతినిధ్యం వహించారు. త్వరలో కేరళలో నిర్వహించనున్న జాతీయస్థాయి పోటీల్లో వీరు పాల్గొననున్నారు. వీరిని ఎంఈఓ బంటు విజయకుమారి, కేజీబీవీ ఎస్ఓ, పీఈటీ భవాని, ఉపాధ్యాయినులు అభినందించారు.

హైందవ శంఖారావం సభను విజయవంతం చేయండి



దత్తిరాజేరు: దత్తిరాజేరులో ఆహ్వాన కరపత్రాలు విడుదల చేస్తున్న విశ్వహిందూ పరిషత్ సభ్యులు

చీపురుపల్లి: విజయవాడలో 2025 జనవరి 5న నిర్వహించనున్న హైందవ శంఖారావం భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని విశ్వహిందూ పరిషత్ విజయనగరం విభాగ్ వ్యవస్థా ప్రముఖ్ శివప్రసాద్, చీపురుపల్లి ఖండ కన్వీనర్ వి.సతీష్‌కుమార్ కోరారు. హిందూ దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కోరుతూ విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న శంఖారావం సభకు సంబంధించిన కరపత్రాలను పట్టణంలోని లయన్స్‌క్లబ్ హాల్‌లో ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బహిరంగ సభకు హిందువులంతా తరలిరావాలని కోరారు.

హిందువులంతా తరలిరండి

దత్తిరాజేరు: విజయవాడలో 2025 జనవరి 5వ తేదీన నిర్వహించనున్న హైందవ శంఖారావం బహిరంగ సభకు హిందువులంతా తరలి రావాలని విశ్వహిందూ పరిషత్ సభ్యుడు జాగారపు కృష్ణ పిలుపునిచ్చారు. గజపతినగరం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ దుర్గాప్రసాద్‌తో కలిసి మండల కేంద్రంలో ఆదివారం ఇంటింటికీ ఆహ్వాన కరపత్రాలు పంపిణీ చేశారు. హిందూ దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలని, ఆలయ పరిసరాల్లో ఉన్న దుకాణాలను హిందువులకే కేటాయించాలని కోరుతూ నిర్వహించనున్న హైందవ శంఖారావాన్ని అంతా విజయవంతం చేయాలని కోరారు.



చీపురుపల్లి: చీపురుపల్లిలో కరపత్రాలు విడుదల చేస్తున్న విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు

అవగాహనతోనే ఎయిడ్స్ నియంత్రణ

ఎయిడ్స్‌పై అవగాహన పెరిగితేనే నియంత్రణ సాధ్యమని వైద్యాధికారులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా పీహెచ్‌సీల వైద్యాధికారుల ఆధ్వర్యంలో గజపతినగరం, ఎస్.కోట, చీపురుపల్లి నియోజకవర్గాల్లో ఆదివారం అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించారు. ప్రాణాంతకమైన ఎయిడ్స్ వ్యాధి నిర్మూలనకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. వేపాడలో పీహెచ్‌సీ వైద్యాధికారి ధరణి ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎస్.కోట డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ కేశవరావు మాట్లాడుతూ హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులను అంటరాని వారిగా చూడకూడదన్నారు. ఎస్.కోట ఏరియా ఆస్పత్రి వద్ద నిర్వహించిన సదస్సులో డాక్టర్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ ఎయిడ్స్‌కు మందులేదని, నివారణ ఒక్కటే మార్గమని అన్నారు.కొత్తవలస, వియ్యంపేట, లక్కవరపుకోటలో నిర్వహించిన ర్యాలీల్లో ఆయా గ్రామాల పీహెచ్‌సీ వైద్యాధికారులు సీతల్‌వర్మ, గోపాలకృష్ణ అనీల్‌కుమార్ మాట్లాడుతూ ఎయిడ్స్ అంటు వ్యాధి కాదని, అంటించుకునే వ్యాధని అన్నారు. గజపతినగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ రావాడ సత్యనారాయణ ఆధ్వర్యంలో విద్యార్థులు, అధ్యాపకులు మానవ హారం ఏర్పాటు చేశారు. అలాగే గజపతినగరంలో ఏరియా ఆస్పత్రి సిబ్బంది ర్యాలీ చేశారు.

– వేపాడ/శృంగవరపుకోట/ కొత్తవలస/ లక్కవరపుకోట/గజపతినగరం



శృంగవరపుకోట: ఎస్.కోటలో ర్యాలీ చేస్తున్న ప్రాంతీయ ఆస్పత్రి వైద్య సిబ్బంది



కొత్తవలస: వియ్యంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది,విద్యార్థులు



వేపాడ: వేపాడ పీహెచ్‌సీ వద్ద నినాదాలు చేస్తున్న సిబ్బంది



శృంగవరపుకోట: ఎస్.కోటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ర్యాలీ



కొత్తవలస: కొత్తవలస పీహెచ్‌సీ వద్ద అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి సీతల్‌వర్మ



లక్కవరపుకోట: ఎల్.కోట జంక్షన్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది



గజపతినగరం: గజపతినగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకుల మానవహారం



గజపతినగరం: గజపతినగరంలోర్యాలీ చేస్తున్న స్థానిక ఏరియా ఆస్పత్రి సిబ్బంది

విద్యుత్ చార్జీల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

- అధికారంలోకి వస్తే అయిదేళ్ల పాటు విద్యుత్ చార్జీలు పెంచబోమని చంద్రబాబు హామీ
- ఆరునెలలు గడవకముందే రెండుసార్లు చార్జీలు పెంచిన కూటమి ప్రభుత్వం
- ప్రజలపై రూ.15 వేల కోట్ల విద్యుత్ భారం
- కూటమి పాలనలో రాష్ట్రం అథోగతి పాలు
- విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

గజపతినగరం: విద్యుత్ చార్జీల పెంపు నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య డిమాండ్ చేశా రు.స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం నిర్వహిం చిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్డీయే కూటమిని గెలిపిస్తే వచ్చే అయిదేళ్ల పాటు విద్యుత్ చార్జీలను ఒక్క రూపాయి కూ డా పెంచబోమని ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు హా మీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికా రంలోకి వచ్చి ఆరునెలలు గడవకముందే ఇంధన సర్దుబాటు చార్జీల పేరిట రెండు సార్లు రూ.15వేల కోట్లకు పైగా భారాన్ని ప్రజలపై మోపారని మండిపడ్డారు. గత వైఎస్సార్ సీపీ ప్రభు త్వంలో విద్యుత్ చార్జీలపై బాదుడే బాదుడు అంటూ చంద్రబాబు నాయు డు, టీడీపీ నేతలు ఊదరగొట్టారని, అయిదు నెలల పాల నలో రెండుసార్లు చార్జీలు పెంచారని, మరి ఇప్పుడేమనుకోవాలని ప్రశ్నించారు. ఇంధన సర్దుబాటు చార్జీల పేరిట దీపావళి పండగ తర్వాత రూ.6 వేల కోట్లు, తాజాగా రూ.9వేల కోట్ల భారాన్ని ప్రజల నెత్తిన చంద్రబాబు ప్రభుత్వం మోపుతోందని, ఇది సమంజసం కాదన్నారు. సూపర్ సిక్స్‌తో పాటు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారని, వాటిని నెరవేర్చాల్సిన బాధ్యత చంద్రబాబుకు ఉందా లేదా అని ప్రశ్నించారు. బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామన్నారని, ఎక్కడై నా ఒక్కరికై నా ఇచ్చారా అని నిలదీశారు. ఒక్క హామీ కూడా అమలు చేయకుండా, అభివృద్ధి చేయకుండా ఈ అయిదు నెలల్లో రూ.63 వేల కోట్లు అప్పుచేశారని, రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారని దుయ్యబట్టారు.

అసమర్థపాలనతో రాష్ట్రం సర్వనాశనం

రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలు, బాలికలు, చిన్నారులపై లైంగికదాడులు పెరిగిపోయాయని, గంజాయి రవాణా విచ్చలవిడిగా సాగుతోందని, ఊరూరా బెల్టుషాపులు వెలుస్తున్నాయని, ఇదంతా ప్రభుత్వ చేతకాని తనానికి నిదర్శనమని అప్పలనరసయ్య ఆరోపించారు. చంద్రబాబు అసమర్థ పాలనతో రాష్ట్రం సర్వనాశనం అవుతోందని అన్నారు. జిల్లా నుంచి ధాన్యం తూర్పు,పశ్చిమ గోదావరి జిల్లాల మిల్లులకు తర లిపోతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం హాస్యాస్పదంగా ఉందని చెప్పారు. పీడీఎస్ బియ్యం స్మగ్లింగ్ అవుతున్నాయని పదేపదే సార్లు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చెప్పడం ఆశ్చర్యం కలిగిస్తోం దని, స్మగ్లింగ్‌ను ఎందుకు అరికట్టలేకపోతున్నారని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నది వారేనన్న సంగతి ఆయన మరచిపోయాడేమోనని ఎద్దేవా చేశారు. డిప్యూటీ సీఎం ప్రశ్నలకు సీఎం చంద్రబాబునాయుడు సమాధానం చెప్పాలని పట్టుబట్టారు. స్మగ్లింగ్‌ను అరికట్టలేకపోతున్నామని మంత్రులే చెబుతుంటే అసలు ప్రభుత్వం ఉందా లేదా అన్న సందేహం కలుగుతోందని అన్నారు.తమ అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు ఎల్లో మీడియా ద్వారా డైవర్షన్ పాలిటిక్స్‌తో కాలయాపన చేస్తున్నారని, వైఎస్సార్‌సీపీ అధినేత,మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఆరోపణలు చేయడమే పనిగా పెట్టుకున్నారని అన్నారు. జిల్లాలో ప్రైవేటు భూములు అన్యాక్రాంతమైపోయాని, వైఎస్సార్ సీపీ నేతలే వీటికి కారణమని ఆంధ్రజ్యోతి పత్రికలో ఇటీవల కథనాలు వచ్చాయని, దమ్మూ ధైర్యం ఉంటే వాటిని వెలికి తీయాలని సవాల్ చేశారు. ఇటువంటి తప్పుడు రాతలు రాసి పరువు తీసుకోవద్దని హితవు పలికారు. మాజీ జెడ్పీటీసీ సభ్యుడు గార తవుడు,వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు, సీనియర్ నాయకులు వి.ముత్యాల నాయుడు, బెల్లాన త్రినాథరావు, కరణం ఆదినారాయణ, రేగ సురేష్, కర్రి రామునాయుడు, పి.నారాయణమూర్తి, జి.సత్యనారాయణ, అప్పల నాయుడు, స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

రైతన్నకు నష్టం



బొండపల్లి: పట్రువాడలో తడిసిన వరి పనలు



లక్కవరపుకోట: లచ్చింపేటలో పొలంలో తడిసి పోయిన వరి పనలు



లక్కవరపుకోట : ఖాసాపేట పొలాల్లో వరి కుప్పల చుట్టూ చేరిన నీరు



వేపాడ: నల్లబిల్లిలో వర్షానికి తడిసిన వరి పనలు

లక్కవరపుకో/కొత్తవలస/వేపాడ: ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలు వరిసాగు చేసిన రైతులకు నష్టాన్ని మిగుల్చుతున్నాయి. కొత్తవలస,లక్కవరపుకోట మండలాల్లో పలు గ్రామాల్లో రైతులు ఇప్పటికే వరి కోతలు కోశారు. కొన్ని గ్రామాల్లో పంటను పొలాల్లోనే చిన్న చిన్న కుప్పలుగా వేయగా, మరికొన్ని చోట్ల చేను పొలంలోనే ఉండిపోయింది. వర్షానికి పనలు తడిసి ముద్దయ్యాయి. వేపాడ మండలంలోని నీలకంఠరాజపురం,నల్లబిల్లి, వల్లంపూడి, వీలుపర్తి, వేపాడ, వావిలపాడు తదితర గ్రామాల్లో వరి పనలు తడిసిపోయాయి. మరో రెండు రోజులు వర్షాలు కురిస్తే ధాన్యం రంగు మారిపోయే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం మొలక రాకుండా ఉండేందుకు పొలంలో కుప్పలు పెట్టకుండా ఉన్న పనలపై ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలని ఏఓ స్వాతికుమారి సూచించారు.

6వేల హెక్టార్లలో కోతలు పూర్తి

బొండపల్లి: తుఫాన్ ప్రభావంతో గజపతినగరం సబ్ డివిజన్ పరిధిలోని బొండపల్లి,గజపతినగరం,దత్తిరాజేరు,మెంటాడ మండలాల్లో శనివారం, ఆదివారం విస్తారంగా వర్షం కురిసింది. పొలాల్లో వరి కుప్పలతో పాటు ఇంకా కుప్పలు పెట్టకుండా పొలంలోనే ఉంచిన పనలు పూర్తిగా తడిచి పోయాయి. గజపతినగరం సబ్ డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల్లో ఏడాది ఖరీఫ్‌లో 13,500 హెక్టార్లల్లో వరిసాగు చేయగా, ఇప్పటి వరకు 6వేల హెక్టార్లలో కోతలు పూర్తయ్యాయి.